క్లుప్తంగా

నాగేంద్ర స్వామి ఆలయం హుండీ లెక్కింపు



పొన్నూరు: మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామంలోని నాగేంద్ర స్వామి దేవస్థానం (పుట్ట) హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు దేవాదాయ శాఖ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. నాలుగు నెలలకు సంబంధించిన హుండీ లెక్కింపులో ఆలయానికి రూ.1,29,120 రాబడి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ఆలయ చైర్మన్ వడాల శెట్టి శివ నాగేంద్రమ్మ, అర్చకులు పవన్, సిబ్బంది కష్ణ పాల్గొన్నారు.

దుకాణాల్లో వరుస చోరీలు

పెదనందిపాడు: దుకాణం తాళాలు పగులగొట్టి, నగదు దోచుకెళ్లిన ఘటన పెదనందిపాడులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. పెదనందిపాడు రామాలయం ఎదురుగా ఉన్న టీ స్టాల్‌లో రూ.10వేలు, పక్కనున్న సంగం డెయిరీ పార్లర్‌లో రూ.43వేలు నగదు దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించి, ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ ఘటనతో పోలీసులు రాత్రిళ్లు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకులానికి ఇన్వర్టర్ల విరాళం



గుంటూరు రూరల్: అడవి తక్కెళ్లపాడు గ్రామంలోని అంబేడ్కర్ గురుకులానికి దాతలు రూ. 40 వేల విలువ చేసే ఇన్వర్టర్, బ్యాటరీలు విరాళంగా గురువారం ఇచ్చారు. రోటరీ క్లబ్ గుంటూరు వికాస్ సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోలిశెట్టి ప్రేమ్ కుమార్ సతీమణి సీతారాణి జయంతి సందర్భంగా వారి కుమార్తె రమ్యశిల్ప వీటిని అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ పి.శివన్నారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి రావాలని కోరుకుంటున్నానన్నారు. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, తన శ్రీమతి ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండేవారని, అందువల్లే ఆమె జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం రోటరీ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ మద్ది రాధాకృష్ణ, సెక్రటరీ మెహతాబ్ ఖాన్, కోశాధికారి రాధాకృష్ణయ్య, సభ్యులు దగ్గుపాటి సాంబశివరావు, కొత్తమాసు వెంకటేశ్వరరావు, పాలేటి సుబ్బారావు, బీవీ అప్పారావు, గురుకులం ప్రిన్సిపాల్ వెస్లీ, గురుకులం అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎల్ఐసీ శకిమంతం కావాలి



కొరిటెపాడు(గుంటూరు): దేశ విస్తృత ప్రయోజనాల రీత్యా ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎల్ఐసీ మరింత శక్తి వంతం కావాలని, అధికారులు, ఉద్యోగులు, ఏజంట్స్ సంఘటితంగా కృషి చేస్తూ సంస్థ అభ్యున్నతికి అకుంఠిత దీక్షతో పని చేయాలని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లిఖార్జున ప్రసాద్ సూచించారు. అరండల్‌పేటలోని ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన వారోత్సవాల ముగింపు సభలో గురువారం ఆయన మాట్లాడారు. 24 ప్రైవేటు కంపెనీలతో పోటీ పడుతున్న ఎల్ఐసీ తన పాలసీదారులకు మరింత ఉన్నతమైన సేవలందించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఎల్ఐసి అరండల్‌పేట బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ బి.రవీంద్ర, అధికారులు ప్రసాద్, డి.సుమ, శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, శంకరరావు పాల్గొన్నారు.

9న గుంటూరులో యానాదుల రాజకీయ భేరి

నెహ్రూనగర్: యానాదుల పొలిటికల్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరులో ఈ నెల 9న యానాదుల రాజకీయ భేరి బహిరంగ సభ బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కేసీ కల్లూరు చిన పెంచలయ్య, యందేటి వెంకట సుబ్బయ్యలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం అంబేడ్కర్ భవన్‌లో రాజకీయ భేరి బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పార్టీ అయితే యానాదులకు మద్దతుగా ఉంటుందే ఆ పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాపట్ల బ్రహ్మయ్య, కె సూరిబాబు, పొన్నూరు అంకమ్మరావు, మన్యం కోటయ్య, ఆర్ మధు, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



దశావతార వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో స్వామివారు



యాదవపాలెంలోని కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే రోశయ్య, క్రికెటర్ అంబటి రాయుడు



శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

పొన్నూరు: పట్టణంలోని రైలు పేటలో ఉన్న బలరామ శ్రీకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. బలరామ శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. శ్రీకృష్ణునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉట్టి మహోత్సవం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే రోశయ్య ఉట్టి కొట్టి చిన్నారులతో సందడి చేశారు. సాయంత్రం శ్రీకృష్ణుని గ్రామోత్సవం వైభవంగా సాగింది. కార్యక్రమంలో ఇరిగేషన్ డైరెక్టర్ దాసరి నారాయణ రావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు, ఇనగంటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు కొల్లేరు శ్రీనివాసరావు, కార్యదర్శి మట్టి శేషుబాబు, కోశాధికారి వంశీకృష్ణ, సభ్యులు పర్యవేక్షించారు. అలాగే స్థానిక శ్రీ వేద విద్యాసంస్థలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణలు గోపికమ్మల కోలాటాలు అలరించాయి. ప్రాంగణంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ అంబటి ఏడుకొండలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం పండుగలు

గుంటూరు రూరల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేవి మన పండుగలని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. గురువారం మండలంలోని చల్లావారి పాలెం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆలయ పూజారి, గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు అంబటి రాయుడును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను నేరుగా వలంటీర్ వ్యవస్థ ద్వారా అందజేస్తున్నారన్నారు. నాడు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నేడు జగనన్న పాలనలో గ్రామ సచివాలయం రూపంలో అందుబాటులోకి వచ్చిందన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి శ్రీ కృష్ణజన్మాష్టమి ఉట్టి కొట్టే కార్యక్రమంలో రాయుడు పాల్గొన్నారు. ఉట్టి కొట్టి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గెంపూడి కిషోర్‌రెడ్డి, ముక్కాల భాస్కర్‌రెడ్డి, ఆరుదల ఏడుకొండలు, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, ఇంటూరి సాంబశివారెడ్డి, తాడిపత్రి పాపిరెడ్డి, ఆరుదల శ్రీనివాసరావు, చల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శలపాడులో వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

వేణుగోపాలస్వామి దేవస్థానంలో

చేబ్రోలు: చేబ్రోలులోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్థానిక భక్త బృందం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శలపాడు గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

పెదకాకాని: దశావతార వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు చేతుల మీదుగా రుక్మిణి సమేత సత్యభామ సమేత శ్రీ కృష్ణ భగవానునికి పంచామృతములతో అభిషేకాలు జరిపించారు. ప్రసాదాలు నివేదన చేశారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ గోత్రనామ పూజలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు

నారాకోడూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

చేబ్రోలు: సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు యాదవపాలెంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కృష్ణ మందిరం వద్ద శ్రీకృష్ణుడి విగ్రహానికి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడు ఇరువురు పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి, క్రికెటర్ అంబటి ఉత్సాహంగా పాల్గొన్నారు. యువకులు, పెద్దలు, గ్రామస్తులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ దుష్టశిక్షణ శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో శ్రీకృష్ణభగవానుడు మానవాళికి దిశానిర్దేశం చేశారన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు మాట్లాడుతూ నారాకోడూరు ప్రాంతంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనటం తన అదృష్టమన్నారు. ఎమ్మెల్యే రోశయ్య ఆధ్వర్యంలో గ్రామంలో సుమారు రూ. కోట్ల మేర అభివృద్ధి పనులు జరగటం పట్ల అభినందనలు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి, క్రికెటర్ అంబటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రీకృష్ణ సమాజం సభ్యులు, స్థానిక యువకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు భ్రమరాంబకు లక్ష గాజుల అలంకరణ



గాజుల అలంకరణ పనుల్లో సేవా సమితి సభ్యులు

పెదకాకాని: శ్రావణ మాసం చివరి శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని లక్షగాజులతో అలంకరించి, పూజలు చేయడం జరుగుతుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు గురువారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రధాన అర్చకస్వామి పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా ముత్తయిదువులకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు పూజా ద్రవ్యాలతో పాటు కలశ పాత్ర వెంట తీసుకురావాలని తెలిపారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే ప్రతి మహిళకు ఆలయం నుంచి పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క, అష్టలక్ష్మీ దేవి అమ్మవారి రూపు ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఏసీ తెలిపారు. ప్రతి శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ, అమ్మవారి రథోత్సవ సేవలో భక్తులు స్వయంగా పాల్గొనవచ్చన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ తనిఖీ



కార్డుదారులతో మాట్లాడుతున్న డీఎస్‌వో కోమలి పద్మ

చేబ్రోలు: పేదలకు రేషన్‌బియ్యం సక్రమంగా అందించాలని డీఎస్‌వో కోమలి పద్మ అన్నారు. మండలంలోని కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం రేషన్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం, రేషన్ వాహనాల ద్వారా కార్డు దారులకు అందిస్తున్న బియ్యం వివరాలను తనిఖీ చేశారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఏఎస్‌వో భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అధిక రసాయనాలతో దిగుబడులపై ప్రభావం



గోళ్లమూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పి.సంధ్యారాణి

పెదకాకాని: రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడటం ద్వారా భూమి సారవంతం క్షీణించి, దిగుబడులు తగ్గిపోతాయని ఏఓ పి.సంధ్యారాణి తెలిపారు. మండలంలోని గోళ్ళమూడి గ్రామంలోని వరి పంటలో గురువారం పొలంబడి కార్యక్రమం జరిగింది. విస్తీర్ణంలో శత్రు, మిత్ర పురుగుల ఉధ్రుతిని గమనించాలన్నారు. ప్రస్తుత వరి పంటలో ఆకుముడుత పురుగు ఆర్థిక నష్ట పరిమితి స్థాయి తక్కువగా ఉన్నందున ఎటువంటి పురుగు మందు పిచికారి చేయవలసిన అవసరం లేదని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్‌వీ శివాజీ, వీఏఏ విజయలక్ష్మి, గ్రామ వలంటీర్లు సీహెచ్ పుష్ప రోహిణిలు, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

'కళ్లం'లో డిజిటల్ ఇంజినీరింగ్‌పై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సతీష్ దాట్ల

గుంటూరు రూరల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ ఉన్నత శిఖరాలను చేరాలని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో డిజిటల్ ఇంజినీరింగ్‌పై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు వినియోగించుకుని, ఆధునిక ప్రపంచంలో నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు పోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ నాస్కాంకు చెందిన రీసెర్చ్ ఇంజినీరింగ్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ సతీష్ దాట్ల మాట్లాడుతూ బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు సాంకేతిక పోటీ ప్రపంచంలో వివిధ స్కిల్ ఆధారిత కోర్సులను నేర్చుకోవడం ద్వారా, ఇంటర్న్‌షిప్ ఆధారిత ఉపాధి పొందవచ్చన్నారు. కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ కోర్సులలో ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ – నాస్కాంకి సంబంధించిన వివిధ సర్టిఫైడ్ కోర్సులను ప్రవేశపెట్టాలని తద్వారా ఉపాధి నైపుణ్యాలను పెంచుకోవచ్చని కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్బీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైనా గైర్హాజరు ప్రభావం ఉంటుంది

- విశ్లేషకులు, విద్యావేత్త ఇ.చంద్రయ్య
- జీ–20పై అవగాహన చర్చా గోష్ఠి



మాట్లాడుతున్న విద్యావేత్త ఇ.చంద్రయ్య, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: చైనా అధ్యక్షుడు జిన్‌సింగ్, జీ–20 సమావేశాలకు గైర్హాజరు కారడమన్నది ఈ పన్నెండేళ్లలో ఇదే తొలిసారి, సదస్సు తీసుకోబోయే నిర్ణయాలపై ఈ ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని విశ్లేషకులు, విద్యావేత్త ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం చర్చా గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ జీడీపీలో 85 శాతం వాణిజ్యంలో 75 శాతం జనాభాలో మూడింట రెండువంతులకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ కూటమీ సదస్సులో ఇప్పటి వరకూ క్రమం తప్పకుండా పాల్గొన్న జిన్‌సింగ్ కేవలం ఈ సదస్సుకు రాకపోవడానికి కారణం అధ్యక్ష స్థానంలో భారత దేశం ఉండటమేనన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, ఎ.పి లాయర్ల ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ఈ సదస్సులో చైనా రష్యాలతో ముడిపడి ఉన్న మన సమస్యలకు అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వక తప్పదన్నారు. అనంతరం పలువురు సంస్థ సీనియర్ సభ్యులు చర్చలో పాల్గొని ప్రసంగించారు. సమావేశానంతరం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి సనాతనాన్ని మలేరియా, డెంగీ, కరోనా వంటి వ్యాధులతో పోలుస్తూ నిర్మూలన గురించి పలువురు మాట్లాడటాన్ని ఖండించారు.

హస్త భూషణమే కాదు మస్తిష్క వికాసం కూడా..

లక్ష్మీపురం: పుస్తకం మనోనేస్తమని, సమాజోద్ధరణకు ఊతమిస్తుందని ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, నూతన ఆవిష్కరణాన్ని ఆజ్యం పోసేది పుస్తక పఠనమేనని ప్రముఖ సాహితీవేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జాతీయ పుస్తక పఠన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పొన్నూరు రూరల్ సీఐ బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాల్‌రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి టౌన్ పీఎస్ సీఐ యు.శోభన్‌బాబును వీఆర్‌కు, పొన్నూరు రూరల్ సీఐ పి.ప్రభాకర్‌ను సత్తెనపల్లి టౌన్ పీఎస్‌కు, నరసరావుపేట ట్రాఫిక్ పీఎస్ ఎం.రాంబాబును పొన్నూరు రూరల్ పీఎస్‌కు బదిలీ చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

పట్నంబజారు: స్థల యజమాని సంబంధం లేకుండా అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. చంద్రమౌళినగర్‌కు చెందిన కొమ్మినేని నాగమల్లేశ్వరి గోరంట్లలో ఉన్న తన స్థలాన్ని విక్రయించేందుకు వెంకటస్వామికి జీపీఏ చేసింది. వెంకటస్వామి నాగమల్లేశ్వరికి తెలియకుండా పలువురికి ఆస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశాడు. విషయం తెలుసుకున్న నాగమల్లేశ్వరి జీపీఏను రద్దు చేయించింది. అయినప్పటికీ వెంకటస్వామి ఆస్థలాన్ని మరికొందరికి రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాజువాల్టిలో సీనియర్ రెసిడెంట్లు పనిచేయాలి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ క్యాజువాలిటీలో సీనియర్ రెసిడెంట్ వైద్యులు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. గత రాత్రి క్యాజువాల్టిలో సీనియర్ రెసిడెంట్‌లు తనిఖీలు చేసిన సమయంలో విధుల్లో లేరని తద్వారా రోగులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. గురువారం సూపరింటెండెంట్ చాంబర్‌లో పలు వైద్య విభాగాధిపతులతో ఆయన సమావేశం నిర్వహించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులను, వైద్య సిబ్బందిని పెద్ద ఎత్తున ఆసుపత్రిలో నియమిస్తున్నట్లు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం..గ్రామస్తులకు శాపం

- వెనిగండ్లలో రంగుమారిన నీరు సరఫరా
- నీటిలో పురుగులు తేలుతున్నాయని గ్రామస్తుల ఆందోళన
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పారిశుద్ధ్యం మాట ఎరుగుని పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు





రంగుమారిన తాగునీరు

పెదకాకాని: రక్షిత మంచినీటి పథకం ద్వారా రంగు మారిన నీరు గ్రామంలో సరఫరా అవుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెనిగండ్లలో రక్షిత మంచినీటి పథకం ద్వారా 1900 కుళాయిలకు తాగునీరు సరఫరా అవుతోంది. పంచాయతీ కార్యదర్శి గానీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కానీ నీటి సరఫరాలో కనీస ప్రమాణాలు కూడా పాటించడం లేదు. గ్రామంలో రెండు రోజులకు ఒక రోజు తాగునీరు సరఫరా అవుతుంది. పైప్‌లైన్లు లీక్ అయినా, ఎయిర్ వాల్స్ మరమ్మతులకు గురైనా నెలల తరబడి వాటిని పట్టించుకునే దిక్కులేదు. ఎయిర్ వాల్‌లోకి మురుగు కాలువలో నీరు చేరుతున్నా పట్టించుకోవడం లేదు. పరిశుద్ధమైన నీరు సరఫరా చేసేందుకు వాటర్ స్కీంలో అన్ని రకాల వనరులు ఉన్నప్పటికీ కేవలం అధికారులు నిర్లక్ష్యం కారణంగానే గత బుధవారం రంగుమారిన నీరు సరఫరా అయింది. రెండవ రోజుకు నీళ్ల బిందెల్లో పురుగులు కనిపిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షా కాలం గ్రామంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయని, బ్లీచింగ్ సున్నం చల్లించాలని, పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని, దోమల నివారణకు ఫ్యాకింగ్ చేయించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది పంచాయతీ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి మార్పు లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల కనీస అవసరాలైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటివి మెరుగు పరచాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తహసీల్దారుకు సర్పంచ్‌ల సన్మానం



తహసీల్దారు గోపాలకృష్ణను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

చేబ్రోలు: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఉత్తమ సేవలు అందిస్తున్న తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ ప్రజల మన్ననలు పొందుతున్నారని చేబ్రోలు సర్పంచ్ అత్తోట వినీతారాణి అన్నారు. జిల్లా ఉత్తమ తహసీల్దారు అవార్డు అందుకున్న కేవీ గోపాలకృష్ణను మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు గురువారం ఘనంగా సన్మానించారు. తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది కాలంలోనే ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించి, ప్రతిభ కనబరిచినట్లు సర్పంచ్‌లు అన్నారు. వినూత్న రీతిలో ప్రజల వద్దకే తహసీల్దారు కార్యక్రమం చేపట్టడంపై అభినందించారు. వడ్లమూడి గ్రామ సర్పంచ్ మోరంపూడి అనితారాణి, శేకూరు మాతంగి శ్యామల, నారాకోడూరు తోట వీరరాఘవమ్మ, వీఎస్‌పాలెం యర్రాకుల అనిత, శ్రీరంగాపురం జాస్తి సాంబశివరావు, గుండవరం చుక్కా సాయి నాగేంద్రమ్మ, గొడవర్రు బీరం జానికీదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత కార్యక్రమాలకు సహకరించాలి

నెహ్రూనగర్: స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ గుంటూరు నగరంలో చేపడుతున్న మొక్కల పెంపకం, పర్యావరణ హిత కార్యక్రమాలకు నగర ప్రజలు సహకరించాలని ఈఈ కొండారెడ్డి కోరారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం నగరపాలక సంస్థ అధికారులు, వార్డ్ సచివాలయ కార్యదర్శులు ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కైస్‌లో భాగంగా స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ పై నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొండారెడ్డి మాట్లాడుతూ నగరంలో వాయు స్వచ్ఛతకు నగరపాలక సంస్థ నుంచి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారిగా మొక్కల పెంపకంపై కార్యదర్శులకు ప్రత్యేక కార్యాచరణ కేటాయించామన్నారు. పరిశుభ్రమైన గాలి ప్రజారోగ్యానికి, ప్రశాంత వాతావరణానికి దోహదం చేస్తుందన్నారు. నగరపాలక సంస్థ వాయు కాలుష్యాన్ని నియంత్రించే కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య విభాగంలో ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోలను అందుబాటులోకి తెచ్చిందని, త్వరలో నగరంలోని అన్ని వార్డ్ సచివాలయాలకు ఈ-ఆటోలు వస్తాయన్నారు.